




ఐఏఎస్, ఐపీఎస్.. పట్టుదల ఉన్న ప్రతి పట్టభద్రుడి కల. ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ.. మూడు దశలనూ దాటుకుని ముచ్చటైన ర్యాంక్ సాధిస్తే చాలు.. పేరు పక్కన మూడక్షరాలు తోడవుతాయి. చాలా సందర్భాల్లో ఐఐటీ పట్టభద్రులే అగ్రస్థానంలో నిలుస్తున్నా.. అతి సామాన్య కుటుంబంలో పుట్టి, మారుమూల గ్రామాల్లో పెరిగిన.. సగటు విద్యార్థులు కూడా విజేతల జాబితాలో మెరుస్తుంటారు. అలాంటి ఓ 'ట్వల్త్ ఫెయిల్' సాధకుడి కథే ఈ మధ్య సినిమాగా వచ్చింది.

# ఇంటర్ ఫెయిల్.. సివిల్స్ పాస్!

భారతదేశ ఉద్యోగ స్వామ్యంలో సివిల్ సర్వీసులది అత్యున్నత స్థానం. డిగ్రీ పట్టా అందుకున్న లక్షలాది మంది విద్యార్థుల కలల కొలువు ఇది. ఏటా విజేతలుగా నిలిచేది వందల మందే అయినా, ఒక్కొక్కరి గెలుపు వెనుక ఒక్కో స్ఫూర్తిదాయకమైన, ఆసక్తికరమైన కథ కచ్చితంగా ఉండితీరుతుంది. మనోజ్ కుమార్ శర్మ, శ్రద్ధ జోషి దంపతుల నేపథ్యం కూడా ఇలాంటిదే. మనోజ్ సివిల్స్ ప్రస్థానం నేపథ్యంతో తీసిన '12th Fail' (12వ తరగతి ఫెయిల్) హిందీ చిత్రం ఈ మధ్యే విడుదలైంది. విధు వినోద్ చోప్రా నిర్మాణం, దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. ఇందులో విక్రాంత్ మాసే, పాలక్ లాల్వాణీ ప్రధాన పాత్రధారులు.

అక్టోబర్, నవంబర్ నెలలు.. సుదీర్ఘమైన పరీక్షల సన్నద్ధత మధ్యలో సివిల్స్ పరీక్షార్థులు కాస్త విశ్రాంతి తీసుకునే రోజులు. కాబట్టి, సమయం చూసుకునే.. '12th Fail' చిత్రాన్ని విడుదల చేశారని భావించవచ్చు. ఇందులో విక్రాంత్, పాలక్‌తోపాటు నటించిన మరోవ్యక్తి వికాస్ దివ్యకీర్తి. ఈయన 1996లో తన తొలి ప్రయత్నంలోనే సివిల్ సర్వీస్ పరీక్షల్లో విజేతగా నిలిచారు. ఇంతకు ముందు కేంద్ర హోం మంత్రిత్వ శాఖలో అధికారిగా పనిచేశారు. సివిల్స్ ఆశావహులకు మార్గనిర్దేశం చేయడానికి సొంత శిక్షణ సంస్థను స్థాపించే క్రమంలో ఉద్యోగానికి రాజీనామా చేశారు. ప్రస్తుతం ఢిల్లీలో సివిల్స్ కోచింగ్ సెంటర్లు ఎక్కువగా ఉండే ముఖర్జీనగర్‌లో 'దృష్టి ఐఏఎస్' పేరుతో కోచింగ్ సెంటర్ నిర్వహిస్తున్నారు. పైగా '12th Fail' సినిమాలో చాలాభాగం ఇక్కడే చిత్రీకరించడం గమనార్హం. మరో ముచ్చట... మనోజ్ కుమార్ ఐపీఎస్ స్వయంగా వికాస్ దివ్యకీర్తి శిష్యుడు.

**ఎవరీ మనోజ్ కుమార్ శర్మ?**

మనోజ్ మధ్యప్రదేశ్ రాష్ట్రం మొరేనాకు చెందినవాడు. నిరుపేద కుటుంబం. పదో తరగతిలో తృతీయ శ్రేణిలో పాసైనా.. పన్నెండో తరగతిలో మాత్రం హిందీ తప్ప అన్ని సబ్జెక్టులూ ఫెయిలయ్యాడు. ఇక్కడే ఓ సంఘటన మనోజ్ జీవితాన్ని మలుపుతిప్పింది. తన క్లాస్‌మేట్ శ్రద్ధా జోషితో మనోజ్ ప్రేమలో పడ్డాడు. అయితే పన్నెండో తరగతి ఫెయిలైన కారణంగా ఆమెకు తన ప్రేమ విషయాన్ని వెల్లడించడానికి భయపడిపోయాడు. చివరికి ఓ రోజు ధైర్యం చేసి మనసులో మాట చెప్పాడు. "నువ్వు గనుక నా ప్రేమను అంగీకరిస్తే, ప్రపంచాన్ని తలకిందులు చేస్తాను" అని ఆత్మవిశ్వాసాన్ని ప్రకటించాడు. శ్రద్ధ మనోజ్‌ను తిట్టడమో, చెంపమీద కొట్టడమో చేయలేదు. అకడమిక్ రికార్డును గుర్తుచేసి వెక్కిరించనూ లేదు. అతని ప్రేమకు ఆమోదం తెలిపింది. ప్రేమ విజయం మనోజ్‌లో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. జీవితంలో దేన్నయినా సాధించగలననే నమ్మకం కలిగించింది. తన చిరకాల స్వప్నమైన ఇండియన్ పోలీస్ సర్వీస్ – ఐపీఎస్ కొలువును సాకారం చేసుకోవాలని తీర్మానించుకున్నాడు. ఉన్నపళంగా సివిల్స్‌కు ప్రిపేర్ కావడం మొదలుపెట్టాడు. ఈ ప్రయత్నంలో శ్రద్ధా జోషి అన్ని విధాలుగా అండగా నిలిచింది. ఆమె మద్దతుతో మనోజ్ ఎంత శ్రమించాలో అంతగా శ్రమించాడు. పేద కుటుంబం కాబట్టి, తన ఖర్చులకు డబ్బులు సంపాదించుకోడానికి టెంపో నడిపాడు. రాత్రివేళల్లో యాచకులతో కలిసి నిద్రించిన సందర్భాలూ ఉన్నాయి. కానీ, మొదటి మూడు ప్రయత్నాల్లోనూ పరాజయం వెక్కిరించింది. చివరిదైన నాలుగో ప్రయత్నంలో విజయాన్ని ముద్దాడాడు. 121వ ర్యాంకు సాధించి ఇండియన్ పోలీస్ సర్వీస్‌కు ఎంపికయ్యాడు. మహారాష్ట్ర కేడర్‌లో ఉద్యోగంలో చేరాడు. ఇప్పుడు ముంబయి పోలీస్ విభాగంలో అడిషనల్ కమిషనర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన దూకుడును చూసి తోటి అధికారులు, పోలీసులు ఆయనను సింగం, సింబా అని ముద్దుగా పిలుచుకుంటారు. ఉద్యోగం సాధించిన తర్వాత మనోజ్ తన ప్రేయసి శ్రద్ధా జోషిని సగర్వంగా పెళ్లాడాడు. ఆమె కూడా మనోజ్ సహకారంతో సివిల్స్‌కు సిద్ధమైంది. మంచి ర్యాంకు సాధించింది. ప్రస్తుతం, ఇండియన్ రెవెన్యూ సర్వీస్ (ఐఆర్ఎస్) అధికారిగా సేవలందిస్తున్నది. ఆ జంట జీవన ప్రయాణం గురించి '12th Fail: హారా వహీ జో లడా నహీ' (12వ తరగతి ఫెయిల్: పోరాడని వాళ్లే ఓడిపోతారు) పేరుతో అనురాగ్ పాఠక్ ఓ పుస్తకం కూడా రాశారు. అన్నట్టు, ఈ చిత్రాన్ని తెలుగులోనూ విడుదల చేస్తున్నారు. ■

**మనోజ్ ఢిల్లీలోని ఓ గ్రంథాలయంలో కొంతకాలం పనిచేశాడు. ఆ అనుభవం పరీక్షల ప్రిపరేషన్‌కు ఎంతగానో ఉపకరించింది. అక్కడ మాగ్జిం గోర్కి, అబ్రహం లింకన్‌లాంటి రాజనీతివేత్తలు మొదలు గజానన్ మాధవ్ ముక్తిబోధ్ లాంటి సాహితీవేత్తల వరకు గొప్ప గొప్ప వ్యక్తుల జీవితాలను అధ్యయనం చేశాడు. వాటినుంచి తన జీవిత ప్రయాణానికి కావాల్సినంత స్ఫూర్తిని పొందాడు.**

